


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం


బుధవారం | 24 | డిసెంబర్ | 2025 ♦ పేజీలు : 4


# ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేక రణ 15 రోజుల్లో పూర్తి చెయ్యాలి
- తాసిల్దార్లతో వీడియో కాన్ఫ రెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రజా జ్యోతి:** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, డేటా మ్యాపింగ్ పనులను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీ ఓసి కార్యాలయంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీవో రాహుల్, అన్ని మండలాల తహసీల్దార్లతో ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్, సీతా రామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ తదితర అంశా లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ ఎంట్రీలు, , బ్లర్ ఫోటోలు, ఇతర లోపాలను గుర్తించి నిబంధనల ప్రకారం సరిదిద్దాలని సూచించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమన్వ యంతో పని చేసి

మిగతా 2 లో...



# కార్మికులే సింగరేణి బలం...



- - కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యా భివృద్ధే ప్రాధాన్య అంశాలు
- - మార్పులను అంది పుచ్చుకొని ముందు కుసాగితే సుస్థిర భవి ష్యత్
- - సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఇన్చార్జి సీఎండీ డి.కృష్ణ భాస్కర్

**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 – ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ బలం కేవలం ఉత్పత్తిలో కాదని.. తరతరాల శ్రమ, క్రమశిక్షణ, పర స్పర నమ్మకంతో పనిచేస్తున్న కార్మి కులేనని ఇన్చార్జి సీఎండీ డి.కృష్ణ భాస్కర్ అన్నారు. 137 సంవత్సరా లుగా ఈ సంస్థ దృఢంగా నిలబ డటం వెనక వీరి కృషి ఉందని పేర్కొ న్నారు. సింగరేణి ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల భద్రత, సంక్షేమం

మిగతా 2 లో...

# మావోయిస్టుల డంప్ స్వాధీనం

- రెండు ఐఈడి బాంబుల నిర్వీర్యం



**చర్ల, డిసెంబర్ 23:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ లో భద్రతా దళాలు మావోయిస్టులపై భారీ విజయాన్ని సాధించాయి. మంగళ వారం సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా మావోయిస్టులు భూగర్భంలో దాచిపె ట్టిన అక్రమ ఆయుధాలు పేలుడు పదా ర్థాల పెద్ద నిల్వను భద్రతా దళాలు కను గొన్నాయి . ఉసుర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని కర్రెగుట్ట కొండల డోలిగుట్ట శిఖర ప్రాంతంలోని ఎఫ్ ఓ బి తడ్పుల లోయ ప్రాంతంలోని దట్టమైన అడవులలో కోబ్రా 294 సి ఆర్ పీ ఎఫ్ 196 ల సంయుక్త బృందం క్షుణ్ణంగా గాలింపు సోదాలు నిర్వహిస్తున్న సందర్భంగా డోలిగుట్ట శిఖర ప్రాంతంలోని అనుమా నాస్పద ప్రదేశాల నుండి ఆయుధాల మరమ్మతు సామగ్రి, బి జి ఎల్ కణాల నిర్మాణానికి సంబంధించిన పదార్థాలు మావోయిస్టులు దాచిపెట్టిన పేలుడు పరికరాలను స్వాధీనం చేసుకు న్నారు.ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా దళాలకు హాని కలిగించడానికి మావోయిస్టులు అమర్చిన రెండు ప్రెజర్ ఐ ఈ డి లను కూడా స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలో ఉన్న కోబ్రా 204 బాంబు నిర్వీర్య దళం అప్రమత్తంగా వ్యవహరించి రెండు ప్రెజర్ ఐ ఈ డి లను

మిగతా 2 లో...

# గుండాల సీఐ పనితీరు భేష్

- -నిబద్ధత, న్యాయ వ్యవస్థపై పరితపించే అధికారి
- -అంకితభావంతో పనిచేయడమే ఆయన బ్రాండ్
- -గుండాల సిఐ ని ప్రశంసించిన జిల్లా ఎస్పీ




**గుండాల, డిసెంబర్ 23, ప్రజాజ్యోతి:** విధుల పట్ల నిబద్ధతతో న్యాయవ్యవస్థపై నిత్యం పరితపించే గుండాల సీఐ రవీం దర్ పనితీరు భేష్ అని జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజ్ ప్రశంసించారు. మంగళ వారం కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గుండాల పోలీస్ స్టేషన్ కు సంబంధించిన కేసులో నేర పరిశోధ నలో అత్యంత నైపుణ్యం, కట్టుదిట్టమైన పరిశీలన, వృత్తిపరమైన అంకితభ వంతో గుండాల సీఐ రవీందర్ సమ గ్రంగా దర్యాప్తు నిర్వహించారని కొని యాడారు. గుండాల సీఐ చేసిన లోతైన ఇన్వెస్టిగేషన్ ఫలితంగా నేరానికి పాల్ప డిన నేరస్థుడికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయస్థానం

మిగతా 2 లో...

## గుండాల సీఐ పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి...)

పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 7వేల జరిమానా విధిం చారని తెలిపారు. ఈ విశేషమైన విజయం ద్వారా చట్టం అమలులో పోలీస్ శాఖ నిబద్ధత, న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పోలీస్ అధికారి గుండాల సీఐ మాదిరిగా కేసుల పరి శోధనలో చాకచక్యంగా, అంకిత భావంతో టెక్నాలజీకి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం




(మొదటి పేజీ తరువాయి...)

అక్కడికక్కడే సురక్షితంగా ధ్వంసం చేసింది. దీనితో పెద్ద ప్రమాదం తప్పింది.స్వాధీనం చేసుకున్న డంప్ లో చేతితో పట్టుకునే ఫ్లై ప్రెస్, పెద్ద మొత్తంలో బి జి ఎల్ కణాలు (పెద్ద, మధ్యస్థ చిన్న పరిమాణాలు), బి జి ఎల్ తోకలు, స్టీల్ ప్లేట్లు, స్క్రూడ్రైవర్లు, హ్యాక్సా బ్లేడ్లు, ప్లైయర్లు , ఆయుధ మరమ్మత్తు కోసం ఉపయోగించే అనేక ఇతర భారీ ఉపకరణాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మావోయిస్టులు దీర్ఘకాలిక కార్యకలాపాలను నిర్వహించడానికి సిద్ధమవుతు న్నారని ఇది స్పష్టంగా సూచిస్తుంది అని అధికారులు భావిస్తున్నారు .భద్రతా దళాల అప్రమత్తత సమన్వయం వేగవంతమైన చర్య వల్ల మావోయిస్టు ల కుట్రను భగ్నం చేశాయని భద్రతా అధికారులు చెబుతున్నారు. ఈ డంప్ స్వాధీ నంతో ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించే దిశగా ఒక ముఖ్య మైన అడుగును కూడా సూచిస్తుంది అని ఈ ప్రాంతంలో భద్రతా దళాలు తమ శోధన ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి అని మరిన్ని బృందాలను పిలిపిస్తు న్నారు అని మావోయిస్టుల గురించి తమ వద్ద ఉన్న ఏదైనా సమాచారం వీలై నంత త్వరగా అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

## గిరిజన గురుకుల పాఠశాల కిన్నెరసాని స్వర్ణోత్సవ వేడుకకు డీఈవోకు ఆహ్వానం



**పాల్వంచ (టౌన్), డిసెంబర్ 23(ప్రజా జ్యోతి):** ఈ నెల 28వ తేదీన కిన్నెరసాని డ్యామ్ సైట్‌లోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో నిర్వహిం చనున్న 50ఏళ్ల స్వర్ణోత్సవ వేడు కలకు జిల్లా విద్యాశాఖ అధికా రిణి బి.నాగలక్ష్మి పూర్వ విద్యా ర్థుల సంఘం నాయకులు మ ర్యాదపూర్వకంగా ఆహ్వానించా రు.ఈ సం దర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు రమేష్ రాథోడ్ ఆ ధ్వర్యంలో నాయకులు మంగళవారం నాడు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలిశారు.త్వరలో కిన్నెరసాని డ్యామ్ సైట్‌లోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల కిన్నెరసాని నందు జరగనున్న స్వర్ణోత్సవ వేడుకలు భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు వారు వివరించారు.ఈ చారిత్రాత్మక కార్యక్రమా నికి హాజరై విద్యార్థులు, పూర్వ విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు.దీనికి స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.నాగలక్ష్మి స్వర్ణోత్సవ వేడుకలకు తప్పక హాజరవుతానని హామీ ఇచ్చినట్లు పూర్వ విద్యార్థుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో వెంకట్ ,భాస్కర్,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కర్మలకు సర్పంచ్ సహకారం

**ఇల్లందు, డిసెంబర్ 23, ప్రజాజ్యోతి:** మండలంలోని మామిడి గుండాల గ్రామానికి చెందిన సువర్ణపాక సాయమ్మ మృతి చెం దగా మంగళవారం ఆమె కర్మలకు మామి డి గుండాల సర్పంచ్ ఎట్టి రమణ తన వంతు సహాయంగా 50 కేజీలు బియ్యం, దహన సంస్కరణల కు రూ. 2 వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మా నవత దృక్పథంతో సహాయం చేసిన సర్పంచ్ ను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.



# ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఎఈఆర్ ఓలు తమ పరిధిలో పూర్తి బాధ్యత తీసుకుని, బీఎల్ఓలకు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన నిర్వహించి ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాల న్నారు. వెబ్ సైట్ లో అందుబా టులో ఉన్న హౌస్ నంబర్, పేరు, ఈపిక్ నంబర్ సెర్చ్ ఆప్షన్లు డేటా మ్యాపింగ్ ను సులభతరం చేస్తున్నా యని తెలిపారు. అవసరమైన చోట్ల అదనపు సిబ్బంది, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రేపు అన్ని మండలాల్లో తహసీల్దారులు ఒకటి ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం, మరొకటి తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా స్థాయికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు, అదేవిధంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కు సంబంధించిన భూసేకరణను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. ఈ కెనాల్ కోసం అన్నపురెడ్డిపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, జూలూరుపాడు, కొత్తగూడెం, ములకలపల్లి, పాల్వంచ, సుజాతనగర్ మొత్తం 11 మండలాల్లో అవసరమైన భూసేకరణకు సంబంధించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. సర్వేయర్లు ప్రతిరోజూ ఏ మండలాల్లో ఎంతవరకు సర్వే పూర్త యిందో పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు మండలాల్లోని 30 గ్రామాల్లో భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పీపీ సీ కేంద్రాలు, రైస్ మిల్లులను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అశ్వరావుపేట చెక్ పోస్ట్ వద్ద ఇసుక, ధాన్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు 'మన ఇసుక – మన వాహనం' కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని తహసీల్దారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపర్డెంట్ ధారా ప్రసాద్, భూసేకరణ సిబ్బంది యాసీన్, ఎన్నికల శిక్షకుడు సాయికృష్ణ, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులే సింగరేణి బలం...

(మొదటి పేజీ తరువాయి...)




నైపుణ్యాభివృద్ధి ప్రధాన ప్రాధాన్యాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను మరింత మెరుగుపరచడం, పని పరిస్థితులను మరింత సురక్షితంగా చేయడమే లక్ష్యమన్నారు. ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఎన్నో వాతావరణ ప్రతికూలతలు, సాంకేతిక సవాళ్లు, మార్కెట్ మార్పులు ఉన్నప్పటికీ భద్రత ప్రమాణాలను పాటిస్తూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ముందుకు సాగినట్లు గుర్తుచేశారు. ఈ ప్రయత్నంలో ప్రతీ గని కార్మికుడు, సూపర్ వైజర్, అధికారి చూపిన బాధ్యతలను ఆయన ప్రశంసించారు. రానున్న సింగరేణి భవిష్యత్పై అందరం ప్రశ్నించుకోవాలని, వాటికి సమాధానాలు వెతుక్కోవాల్సిన బాధ్యత మనదే అన్నారు. ఈ దిశలోనే ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాల కోసం మన అనుభవం, సామర్థ్యంతో రాణించే ఇతర రంగాలపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, కీలక ఖనిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని మనం పరిశీలించడం ప్రారంభించామన్నారు. ఇవి ఇంకా ఆలోచన దశలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకుండా ముందే సిద్ధమవ్వాలన్న భావనతోనే ప్రయత్నాలు సాగిస్తున్నామని వివరించారు. అలాగే ఇంధన రంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో సింగరేణి ఏ పాత్ర పోషించగలదో అన్నదానిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్మెంట్) బి.వెంకన్న, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ పరిగెన్, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్టెల్లా మేరీస్ స్కూల్ పదవ వార్షికోత్సవ వేడుకలు




**బూర్గంపాడు, డిసెంబర్ 23 (ప్రజా జ్యోతి):** మండలంలోని మొరంపల్లి బంజర్ గ్రామంలో గల స్టెల్లా మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పదవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకాష్ బిషప్,ఎంఈఓ యదుసింహా రాజు పాల్గొన్నారు. ఈ సందర్భం గా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు,నృత్యాలు ఎం తో ఆకట్టుకున్నాయి.అనంతరం ప్రకాష్ బిషప్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలన్నారు. వచ్చే ఏడాది నుండి ఏడవ తరగతి వరకు ఉన్న పాఠశాలను పదవి తరగతికి అప్డేట్ చేయునుట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుమలతను ఆయన అభినందించారు. అనంతరం పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిషప్ సెక్రెటరీ విజయ్, ఫాదర్ ఆంటోనీ,టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర కీలకం

- **సర్పంచ్ లు, వార్డు సభ్యులు ప్రజా సమస్యలను పరిష్కరించాలి గుమ్మడి నరసయ్య**





**ములకలపల్లి, డిసెంబర్ 23, ప్రజా జ్యోతి :**గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం,దేశం అభివృద్ధి చెందుతాయని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌తో పని చేయించుకోవడం ప్రజల హక్కు అని, గ్రామాభివృద్ధిలో ప్రజలు బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారంలో సర్పంచులు, వార్డు సభ్యులు ముందుండి పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అనంతరం నూతనం ఎన్నికైనా ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరు కిషోర్, పాతగుండలపాడు సర్పంచ్ కారం వెంకటేష్, రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ,లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము, నూపా భాస్కర్, జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్, తోడెం దుర్గ, సంయుక్త మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ, డివిజన్ నాయకులు గోనెల రమేష్, కల్లూరి పద్మ, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకిరికంటి నాగేశ్వరరావు, పీఓడబ్ల్యు జిల్లా నాయకురాలు నూపా సరోజిని, ఉపసర్పంచ్ ఈసం శ్రీలత, గ్రామ కమిటీ కార్యదర్శి ఈసం అశోక్, ఈసం బాబురావు, కీసరి బాబురావు, పాయం రాజులు, ఈసం శివ, సవల్ల శివ, సవలం నరేందర్, బాలరాజు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరాలు



**చర్ల, డిసెంబర్ 23:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో మంగళవారం చర్ల ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యం లో మలేరియా ప్రభావిత ప్రాంతాలైన కందిపాడు.,క్రాంతిపురం, వెంకట చెరువు గ్రామాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు .ఆశ కార్యకర్తలు ఇంటి ఇంటికి తిరిగి జ్వరం తో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి జ్వరం తో బాధ పడుతున్న ఐదుగురుకి రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరం గా నిర్ధారించి వైద్యం అందించటం జరిగినది.ఈ సందర్భగా డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండ ప్రజలు జాగర్త వహించాలి అని చుట్టు పక్కల నీటి నిలువలు లేకుండా జాగ్రత్త వహించాలి అని తెలిపారు.కాచి చల్లార్చిన నీటినే త్రాగాలని చలి తీవ్రత పెరుగుతూ ఉండటంతో సీజన్ వ్యాధులు బారినపడకుండా అందరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామ్ ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ గీత ,తులసి, హెల్త్ అసిస్టెంట్ ధర్మా రావు,నరసింహ రావు,హైమావతి,సౌజన్య,స్వరూప ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటే లో భద్రాద్రి విద్యార్థులు ప్రతిభ



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 23(ప్రజాజ్యోతి)** షొటోకన్ కరాటే వారి ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రా స్థాయి కరాటే పోటీల్లో భద్రాచలం పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ జి. భద్రం విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 12 సంవత్సరాల లోపు కటా విభాగంలో క్రాంతివిద్యాలయానికి చెందిన సిహెచ్. రుత్విక్ , బి. అక్షత్ నందన్, పి. రిషిక్, జి.సంగీత, కోమలి, తన్వి శ్రీ ప్రథమ ద్వితీయ స్థానాలు పొందారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు బహుమతి పొందిన విద్యార్థుల్ని అభినందిస్తూ కరాటే మాస్టర్ జి భద్రం ని సన్మానించారు.

## ఉచిత క్యాన్సర్ శిబిరంలో పాల్గొన్న కొత్వాల

- **కొల్లి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం**



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 23(ప్రజా జ్యోతి ):**సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజికంగా ముందుండి సేవ చేయాల్సిన బాధ్యత ఉందని,కొల్లి ఫౌండేషన్ చేపడుతున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచ పట్టణ పరిధిలోని అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో,బసవతారకం ఇండో –అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో కొత్వాల పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ ప్రతి పౌరుని కర్తవ్యమని పేర్కొంటూ, ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ శిబిరంలో 300 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గూడూరు సత్యనారాయణ,తలశిల భరత్, సుజాత,మల్లెల రవిచంద్ర,కొల్లి కల్పనా చౌదరి, రూప్లా, కోండం వెంకన్న,వై. వెంకటేశ్వర్లు (వైవీ ) తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ సెక్రటరీని కలిసిన ఇబ్రహీమ్

**ఇల్లందు, డిసెంబర్ 23, ప్రజాజ్యోతి:** కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు, పట్టణ మండల అధ్యక్షులతో మంగళవారం జరిగిన విస్తృత సమావేశానికి ఏఐసీసీ సెక్రటరీ, మాజీ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పి విశ్వనాథన్, ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యే లు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ లను జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి యండి. ఇబ్రహీమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ముత్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే పాయంను కలిసిన సర్పంచ్ కిషోర్ నాయక్



**బూర్గంపాడు,డిసెంబర్23 (ప్రజా జ్యోతి ):**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని సారపాక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా కిషోర్ ని ఎమ్మెల్యే అభినందించి,సత్కరించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి,తిరుపతి చంటి పాల్గొన్నారు.

## సింగరేణి డే శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 – ప్రజాజ్యోతి :** సింగరేణి కాలరీస్137వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా. ప్రాజెక్ట్ ప్లానింగ్ ప్రాంగణంలో ఉన్న ఈ యొక్క సింగరేణి తల్లిని మొట్ట మొదటిసారిగా ఇల్లందులో 1871 బొగ్గు నిక్షేపాలను కనుగొన్న సర్ విలియం కింగ్స్ బ్రిటిష్ జియాలజికల్ సర్వే శాస్త్రవేత్త.దక్షిణ భారతదేశంలో కొంగుబంగారమైన. ఈ నల్ల బంగారాన్ని కనుగొని. మన తెలంగాణ ప్రజలకు జీవనోపాధి కల్పించి. వారి జీవితాలకు వెలుగునిచ్చిన. సర్ విలియం కింగ్స్ గారి విగ్రహానికి గజమాలతో వారి యొక్క మెడలో వేయడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమం జనరల్ సెక్రెటరీ సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అంతోటి నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బానోతు సైదులు జనరల్ మేనేజర్. చంద్రమౌళి, సభావతి శ్రీనివాస్, రమేష్, మనిష్ విక్టర్, సెంట్రల్ కమిటీ సభ్యులు చెరిపెల్లి నాగరాజు, బ్రాంచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండుగకు రంగుల అద్దం-స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో డ్రాయింగ్ కాంపిటీషన్




**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 23(ప్రజా జ్యోతి ):**పాల్వంచ మున్సిపల్ పరిధిలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని డ్రాయింగ్ కాంపిటీషన్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రిస్మస్‌కు సంబంధించిన వివిధ అంశాలను రంగుల అద్దంలో ఆకర్షణీయంగా చిత్రీకరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ జి.భాస్కర్ రావు, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక,ఆధ్యాత్మిక ప్రతిభను వెలికి తీయడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రిస్మస్ పండుగ కరుణ,ప్రేమ,శాంతి, సౌభ్రాతృత్వాలకు ప్రతీక అని వారు పేర్కొన్నారు.పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు,ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమాదేవి,స్వరూప,మహేశ్వరి,ప్రశాంతి,ఝాన్సీ,సత్యప్రసాద్, సుల్తానా,మాధవి తదితరులు పాల్గొనగా,విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మ అందించడం అభినందనీయం

- పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు భేష్.
- ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి విజయవంతంగా ఆపరేషన్ చేసి సర్కార్ వైద్యంపై నమ్మకం కలిగించారు.
- కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు







**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రజా జ్యోతి** ఆశే లేని చోట ఆయువు పోసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన డీసీ హెచ్ఎస్ డా. జి. రవిబాబు, వైద్యబృందం సేవలు అభినందనీయమని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశంసించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ ఈనెల 9న పశ్చిమ బెంగాల్కి చెందిన బిశాల్ తమంగ్ (35) గొంతుకోసుకుని ప్రాణాపాయస్థితికి చేరుకున్నాడునీ వెంటనే స్పందించిన డా. రవి బాబు, వైద్య బృందం డా. రాంప్రసాద్, డా. సోమరాజు దొర, ఈ ఎన్ టి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్వంచ సామాజికాసుపత్రిలో రెండు గంటలు శ్రమించి శస్త్రచికిత్స చేసి అతనికి ప్రాణం పోశారని తలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మాత్రమే జరిగే ఆపరేషన్ను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో దిగ్వి జయంగా పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. పేదవర్గాల ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు అభినందించి మరింతగా ప్రోచాహించాల్సిందేనని, తన నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలలో ఈ ఘటన చోటుచేసుకోవడం ఆనందంగా ఉందని, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం లేని పరిస్థితిలో పాల్వంచలో జరిగిన శస్త్రచికిత్సతో సామాన్య, పేద వర్గాల చూపు ప్రభుత్వ ఆస్పత్రులవైపు మళ్లించేందుకు దోహదపడుతుందని కూనంనేని అన్నారు.

# ఏసుప్రభు జీవితం అందరికీ ఆదర్శం

- క్రాంతి విద్యాలయం కరస్పాండెంట్ సమత శ్రీనివాస్

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 23(ప్రజాజ్యోతి)** భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సమత శ్రీనివాస్ మాట్లాడుతూ యేసుప్రభు చూపిన ప్రేమ, దయా,కరుణ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దైవ చింతనతో ఇతరులకు చేయూతనివ్వడమే యేసుక్రీస్తు బోధనల పరమార్థం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ చిన్నారులు శాంటా క్లాస్, దేవదూతల వంటి వివిధ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ .హేమ శిల్ప అధ్యాపక,అధ్యాపకేతర బృందం తో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం ఏరియాలో ఘనంగా సింగరేణి దినోత్సవ వేడుకలు

**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో సింగరేణి దినోత్సవ వేడుకలు మంగళవారం కొత్తగూడెం ఏరియా 3 ఇంక్లైన్ లో ఉన్న జి.ఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పాల్గొని సింగరేణి పతాక ఆవిష్కరణ చేశారు. ముందుగా జిఎం జ్యోతి ప్రజ్వలన, కేక్ కట్ చేసి ఉద్యోగులందరికీ సింగరేణి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సింగరేణి దినోత్సవ వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉన్నదని, సింగరేణి సంస్థ నూతన టెక్నాలజీ తో ముందుకు కొనసాగుతూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను, సాధించడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికారులను, కార్మికులను, యూనియన్ నాయకులను, కాంట్రాక్ట్ కార్మికులను వారు అభినందించారు. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఎన్నో మైలురాళ్ళు




సాధించడం జరిగింది. అదే విధంగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ఈ రోజు మన రాష్ట్రములో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా, అంతే కాకుండా ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు మార్గదర్శకంగా ఉండడం చాలా సంతోషకరం అని అన్నారు. ఈ సంస్థలో పని చేస్తున్న మనమందరము ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఎంతో వైభవంగా జరుపుకోవడం మన కర్తవ్యంగా గుర్తించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరములో కొత్తగూడెం ఏరియా కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణ తో సాధించడంలో భాగస్థులైన ఉద్యోగులను, సూపర్వైసర్లను, యూనియన్లను మరియు అదికారులను అభినంధించినారు. ఇదే స్పూర్తి ని కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలలు కూడా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఉద్బోధించినారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జి.ఎం. ఎం. షాలేం రాజుతో పాటు కొత్తగూడెం ఏరియా సేవా ప్రెసిడెంట్ జి. మధురవాణి, కొత్తగూడెం ఏరియా ఐఎన్టియూసి వైస్ ప్రెసి



డెంట్ ఎండి.రజాక్, సి.ఎం.ఓ.ఏ. కొత్తగూడెం ఏరియా ప్రెసిడెంట్ ఎం.వి. నరసింహారావు, ఏరి యా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, ఇంచార్జ్ ఎస్ఓటు జిఎం ఎం. వెంకటేశ్వర్లు, ఎ.జి.ఎం. (పర్సనల్) జి. వి. మోహన్ రావు, ఏజెంట్ పద్మావతి ఖని రామ్ భరోస్ మహాతో, సేవ సెక్రటరీ వై అనిత, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, ఇతర సేవా సభ్యులు, జిఎం.కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 23, ప్రజా జ్యోతి** కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.ఏరు రివర్ ఫెస్టివల్లో భాగంగా మంగళవారం ఆళ్లపల్లి మండలం రాయపాడు గ్రామం నుండి మొతలగూడెం వరకు కిన్నెరసాని రివర్ వాక్ కార్యక్రమాన్ని విజజయవంతంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ రివర్ వాక్లో యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని, కిన్నెరసాని నది పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, నదుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, యువతతో కలిసి రివర్ వాక్లో పాల్గొని వారితో మమేకమయ్యారు. నది తీర ప్రాంతాల వెంట సాగిన ఈ వాక్ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలు, కిన్నెరసాని నది పరిసర ప్రాంతాల సహజ సంపద, అదేవిధంగా జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టతను యువతకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతాలు, నదులు, జలపాతాలు, ప్రకృతి వనరులు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను యువతకు వివరిస్తూ రివర్ వాక్ కార్యక్రమం ముందుకు సాగింది, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిన్నెరసాని నది జిల్లా జీవనాధారంగా ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నది చుట్టూ ఉన్న పచ్చని అడవులు, సహజ వనరులు, జీవ వైవిధ్యం భవిష్యత్ తరాలకు కాపాడాల్సిన అమూల్యమైన సంపద అని తెలిపారు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని సంరక్షించుకుంటూనే దేశ విదేశాలకు పరిచయం చేస్తే జిల్లాలో పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఏరు రివర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం జిల్లాలోని నదుల, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రవాణా, స్థానిక ఉత్పత్తుల విక్రయాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు.యువత సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా కిన్నెరసాని నది ప్రకృతి అందాలు, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫోటోగ్రఫీ, వీడియోలు, డాక్యుమెంటరీలు, రీల్స్, బ్లాగుల ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో నదులను కాలుష్యరహితంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, స్థానిక అల్లపల్లి మండల ఎంపీడీవో శ్రీను, తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంఈఓ సంతా రావు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ చిన్న పాపయ్య, పంచాయతీ సెక్రెటరీ వరుణ్, టిఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల నాయకులు భార్గవ్ చైతన్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మహిధర్, నాగేంద్ర, ఆర్చెరీ కోచ్ కల్యాణ్, సైకిలింగ్ నాగేశ్వర రావు, ఉదయ్ కుమార్, టైక్వాండో రమేశ్, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, స్థానిక యువత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

